
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 మహబూబాబాద్
శుక్రవారం 26 జనవరి 2024



ఎంఈవోలు.. ఉన్నట్టా.. లేనట్టా..!



- 18 మండలాలకు ముగ్గురే..
- పాఠశాలలపై కొరవడుతున్న పర్యవేక్షణ
- సమయపాలన పాటించని ఉపాధ్యాయులు
- ముంచుకొస్తున్న ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు

బదిలీపై వెళ్లినా.. ఇంకా ఇన్‌చార్జిలుగానే..

తొర్రూరు రూరల్, జనవరి 25 : జిల్లాలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. విద్యాశాఖ అధికారులు (ఎంఈవోలు) రెగ్యులర్ వారు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. మొత్తంగా మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాలు ఉండగా, ముగ్గురు సీనియర్ ప్రధానోపాధ్యాయుల (హెచ్‌ఎం)ను ఏంఈవోలుగా ప్రభుత్వం నియమించింది. దీంతో జిల్లాలోని 18 మండలాలకు ఆ ముగ్గురు హెచ్‌ఎంలే ఇన్‌చార్జి ఎంఈవోలుగా వ్యవహరిస్తూ.. పని భారంతో సతమతమవుతున్నారు. ఆయా పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఇటీవలే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలు చేపట్టడంతో పూర్తిస్థాయి ఎంఈవోలు, హెచ్‌ఎంలు వస్తారని ఆశించినప్పటికి, ఉన్న ఇన్‌చార్జి ఎంఈవోలు పూల్‌సింగ్, శ్రీదేవి, రాము బదిలీపై పక్క జిల్లాలకు వెళ్లినా, ఇక్కడే ఇన్‌చార్జి ఎంఈవోలుగా వ్యవహరిస్తున్నారు. దీంతో జిల్లాలో ఉన్న 101 ఉన్నత పాఠశాలలు, 15 కేజీవీబీ పాఠశాలలు, 8 మోడల్ స్కూల్, సుమారు 800 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు ముంచుకొస్తున్నా పర్యవేక్షణ కరువైంది.

బదిలీపై వెళ్లినా..

మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల ఇన్‌చార్జి ఎంఈవోలుగా ముగ్గురు సీనియర్ ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణ చేస్తున్నారు. అందులో నెల్లికుదురు మండల ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న గుగులోతు రాము నెల్లికుదురు, తొర్రూరు, పెద్దవంగర, దంతాలపల్లి, నర్సింహులపేట మండలాల ఎంఈవోగా విధులు నిర్వహిస్తూ.. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా వరంగల్ జిల్లా సంగెం మండల్లానికి వెళ్లారు.

బయ్యారం మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పూల్‌సింగ్ బయ్యారంతో పాటు మహబూబాబాద్, కురవి, సీరోల్, మరిపెడ, గార్ల, డోర్నకల్, చిన్నగూడూరు మండలాల ఎంఈవోగా విధులు నిర్వహిస్తూ ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లారు. కొత్తగూడ ఎదుళ్లపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి కొత్తగూడ మండలంతో పాటు గంగారం, గూడూరు, కేసముద్రం, ఇనుగుర్తి మండలాల ఎంఈవోలుగా విధులు నిర్వహిస్తూ వరంగల్ జిల్లా ఖానాపురం మండలానికి బదిలీపై వెళ్లారు. దీంతో ప్రధానోపాధ్యాయులుగా విధులు అక్కడా..! ఇన్‌చార్జి ఎంఈవోగా పూర్తిస్థాయిలో విధులు నిర్వర్తించలేకపోతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అత్యవసరమైన సమావేశాలు, సంతకాలు ఉంటే జిల్లా కేంద్రానికి రావడం వెళ్లిపోవడమే పరిపాటిగా మారిందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. దీంతోసంతకాల కోసం, ఏమైనా ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు వ్యయప్రయాసాలు పడాల్సి వస్తోంది.

పాఠశాలలను సందర్శించలేని దుస్థితి

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి, పర్యవేక్షించాల్సిన బదిలీపై వెళ్లిన ఇన్‌చార్జి ఎంఈవోలు అధికారులు నెలకొక్క పాఠశాలను కూడా తనిఖీ చేసిన దాఖలాలు లేవు. నెలలో 24 పనిదినాలు ఉండగా, ప్రతీనెల జిల్లాలో జరిగే సమీక్షలు, పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల విద్యా భ్యాసనం, మధ్యాహ్న భోజనం బిల్లులు, పాఠశాలలోని లోటుపాట్లు, ఉపాధ్యాయుల సెలవులు, పరీక్ష పత్రాల పంపిణీపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. అయితే ఉపాధ్యాయులుగా ఉన్న పాఠశాల నుంచి మరో జిల్లాకు బదిలీపై వెళ్లడంతో ఇక్కడ ఎలాంటి తనిఖీలు లేకపోవడం, ఉపాధ్యాయుల నిర్లక్ష్యపు పనితీరును పరిశీలిస్తే ఇక్కడ ఉన్నారా.. ఎక్కడికైనా వెళ్లిపోయారా అనేది సందేహంగానే ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న సమయంలో పర్యవేక్షించాల్సిన అధికారులు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా పాఠశాలకు వచ్చిపోతున్నారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎక్కడి మండల సీనియర్ ఉపాధ్యాయులను అక్కడి ఎంఈవోలుగానైనా నియమిస్తే విద్యా వ్యవస్థ గాడినపడుతుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే చేస్తున్నారు..

జిల్లా విద్యాశాఖ అధికారి, రామారావు

జిల్లాలో ఇక్కడ హెచ్‌ఎంలుగా ఉన్న సమయంలో ఎఫ్ఏసీ ఎంఈవోలు పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లారు. ఇన్‌చార్జి ఎంఈవోలు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎఫ్ఏసీగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, ఉత్తీర్ణ శాతం పెంచడానికి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు బాధ్యతగా విధులు నిర్వహించడంతో పాటు ప్రత్యేక తరగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.



మానుకోటలోని ఎన్టీఆర్ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు

నేడే గణతంత్ర దినోత్సవం

మానుకోట ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి • జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న కలెక్టర్

మహబూబాబాద్, జనవరి25 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం గణతంత్రదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగంఏర్పాట్లు పూర్తి చేసింది. స్వరాష్ట్రం సిద్ధించాక తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో నిర్వహించే ఉత్సవాలకు మైదానాన్ని అధికారులు సిద్ధం చేశారు. ప్రత్యేక అతిథులు ఆసీనులయ్యేందుకు ప్రత్యేకంగా వేదికను తీర్చిదిద్దారు. ఆ వేదికకు ఇరువైపుల ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు వేడుకలను వీక్షించేందుకు షామియానాలను వేసి, సీటింగ్ ఏర్పాటు చేశారు. పరేడ్ నిర్వహించేందుకు పోలీస్‌లు రిహాల్సర్స్ చేశారు. ముఖ్యఅతిథిలు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా అధికారులు ఎన్టీఆర్ స్టేడియాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

మానుకోట ఎన్టీఆర్ స్టేడియంలో..

మానుకోట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. 9 గంటల నుంచి 9.05 వరకు వందనస్వీకారం. 9.05 నుంచి 9.20 వరకు మార్చ్‌ఫాస్ట్ పరేడ్, 9.20 నుంచి 9.30 గంటల వరకు కలెక్టర్ సందేశం ఉంటుంది. 9.30 నుంచి 9.40 వరకు స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, 9.40 నుంచి 9.55 వరకు విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి. 9.55 నుంచి 10.30 వరకు జిల్లాలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశాంసా పత్రాలను అందజేస్తారు. 10.30 నుంచి 10.45 వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శిస్తారు. సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు..

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మానుకోటలో ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీపాటిల్ ఆదేశాలతో ఆర్ఐ అడ్మిన్ అనిల్‌కుమార్ సారథ్యంలో బాంబ్‌స్క్వాడ్ సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జనసంద్రోహం ఉండే ప్రధాన కూడళ్లు నెహ్రూసెంటర్, ఫారెస్టు సెంటర్‌తో పాటు రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లల్లో తనిఖీలు నిర్వహించారు. బ్యాగులను, అనుమానాస్పదంగా కన్పించిన వ్యక్తులను బాంబ్‌స్క్వాడ్ సిబ్బంది రామయ్య, నాగేష్, మురళి క్షుణ్ణంగా పరిశీలించారు.

జిల్లా ఉత్తమ ఉద్యోగులు వీరే.. 8లో

మహబూబాబాద్ ఎంపీపీపై అవిశ్వాసం

- ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందచేసిన 9 మంది ఎంపీటీసీలు



ఆర్డీవో అలివేలుకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 25 : మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీపీకి అవిశ్వాస సెగ తాకింది. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ ఎంపీటీసీలంతా ఏకమై ఎంపీపీపై అవిశ్వాస తీర్మాణానికి ఆర్డీవో అలివేలుకు గురువారం వినతిపత్రాన్ని అందచేశారు. మహబూబాబాద్ మండల పరిషత్‌లో 17 మంది ఎంపీటీసీలు ఉండగా, అందులో ఎంపీపీకి వ్యతిరేకంగా 9 మంది ఎంపీటీసీలు ఏకమై అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. ఎంపీపీ భూక్య మౌనికపై అవిశ్వాస తీర్మాణం పెట్టేందుకు ఎంపీటీసీలు మిట్టకంటి రాంరెడ్డి (అయోధ్య), ఇస్లావత్ నరేష్ (మాధవపురం), తోటయాకాంబ్రం (వీఎస్.లక్ష్మీపురం), బాదావత్ బద్రి (మల్యాల), భూక్య రాంచందర్ (పర్వతగిరి), ఎల్తి మల్లయ్య (అమనగల్), కొండపల్లి రాంచంద్రమ్మ (జంగిలిగొండ) వాంకుడోతు రోజా (సీత్లాతండా), బానోత్ మంగీలాల్ (ఉత్తరతండా) ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందజేశారు.

రూ.500 కోసం వృద్ధురాలి హత్య

- అప్పు ఇచ్చి అడుగుతోందని దారుణం
- గూడూరు మండలం లైన్‌తండాలో ఘటన



తేజావత్ ఈరమ్మ (ఫైల్)

గూడూరు, జనవరి 25 : అవసరానికి తన సమీప బంధువుకు ఓ వృద్ధురాలు అప్పు ఇచ్చింది. తిరిగి ఆ డబ్బులు ఇవ్వాలని అడగడంతో కోపోద్రికుడై ఆమెను హత్య చేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కోబల్‌తండా శివారు మూడుగుడిసెల లైన్‌తండాలో బుధవారం రాత్రి చోటు చేసుకొంది. గురువారం ఎస్సై రాణాప్రతాప్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మూడు గుడిసెల లైన్‌తండాకు చెందిన తేజావత్ ఈరమ్మ (58) అదే తండాకు చెందిన వరుసకు బావ అయిన తేజావత్ స్వామికి వారం రోజుల క్రితం రూ.500 అప్పుగా ఇచ్చింది. తిరిగి ఆ డబ్బులు ఇవ్వమని గత మూడు రోజులుగా అడుగుతూ.. దుర్భాషలాడింది. దీంతో కోపోద్రికుడైన స్వామి బుధవారం రాత్రి ఈరమ్మ నిద్రిస్తుండగా, ఆమె ఇంటికి వెళ్లి గొంతునులిమి హత్య చేసినట్లు ఎస్సై వివరించారు. మృతురాలు కుమారుడు తేజావత్ వీరన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.

కడుపు నింపిన కళను బతికిస్తూ..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'పద్మశ్రీ' పురస్కారానికి ఎంపిక

వెక్కిరింపులను దిగమింగుకుంటూ కళామతల్లి సేవలో తరింపు

ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం

50 ఏళ్లుగా చిందు యక్షగాన ప్రదర్శనల్లో మేటిగా గడ్డం సమ్మయ్య





జనగామ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వారసత్వంగా వచ్చిన కళనే ఆయన నమ్ముకున్నారు. చిన్న తనంలో తండ్రి వెంట నడిచి కడుపు నింపే చిందు యక్షగాన కళామ తల్లి ఒడిలో ఆయన ఒదిగిపోయారు. 16 ఏళ్ల ప్రాయంలోనే వేదికలు ఎక్కి రామాయణ, మహాభారత, భాగవతం, జాంబవ పురాణ కథలను అవలీలగా ప్రదర్శన ఇవ్వడం ప్రారంభించారు. కులవృత్తిగా భావించో, కడుపు నింపుకోవడం కోసమో కాకుండా అంతరించిపోతున్న కళను కాపాడాలనే సంకల్పాన్ని ఆయన తన 16 ఏటనే తీసుకున్నారు. 50 ఏళ్లుగా చిందు యక్షగాన కళన బతికిస్తూ భావితరాలకు అందిస్తున్న జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి చెందిన గడ్డం సమ్మయ్యను 'పద్మశ్రీ' పురస్కారం వరించింది. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పద్మశ్రీ పురస్కారాల జాబితాలో సమ్మయ్యకు చోటు దక్కింది. ఐదు దశాబ్దాలుగా చిందు యక్షగాన కళను బతికిస్తున్న జనగామ జిల్లాకు చెందిన గడ్డం సమ్మయ్యను 'పద్మశ్రీ' పురస్కారం వరించింది. కళల విభాగంలో ఆయన అందించిన సేవలకు గాను 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేసింది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన గడ్డయ్య సమ్మయ్య పేద కుటుంబంలో జన్మించారు. అంతరించిపోతున్న చిందు యక్షగాన కళను బతికిస్తూ జాతీయ స్థాయిలో పుట్టిన గడ్డకు గడ్డం సమ్మయ్య పేరు తెచ్చారు. పాలకుర్తి మండలం వల్మిడిలో గడ్డం(చిందుల) రామస్వామి, చండిగాంబ దంపతులకు సమ్మయ్య 1958లో జన్మించారు. ఆ తర్వాత రామస్వామి దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లిలో స్థిరపడ్డారు. ఆరో తరగతి వరకు చదువుకున్న సమ్మయ్య తల్లిదండ్రులతో పాటు తమ కులవృత్తి అయిన చిందు యక్షగాన ప్రదర్శనల్లో పాల్గొనేవారు. 16 ఏళ్ల వయసులో తొలిసారిగా తండ్రితో కలిసి చిన్ని కృష్ణుడి వేషధారణలో కళారంగ ప్రవేశం చేశారు. జాంబవ పురాణం, భాగవతం, రామాయణం వంటి కథలను ప్రదర్శనల రూపంలో చెప్పడమే చిందు యక్షగానం. చిన్ననాటి నుంచి ఈ కళపై మక్కువతో 5 దశాబ్దాలుగా దాదాపుగా 19 వేల ప్రదర్శనలు ఇస్తూ వస్తున్నారు. సమ్మయ్య లోహితాంకుడు, ప్రహ్లాదుడు, సిరియాలుడు, బాలవద్దిరాజు పాత్రల్లో ఎక్కువగా ప్రదర్శనలు ఇచ్చేవారు. అంతేకాకుండా సత్యహరిశ్చంద్ర, కీచక, కంసుడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు, దుర్యోధనుడు, రావణబ్రహ్మ పాత్రల్లో అద్భుతంగా ఒదిగిపోతారు. గడ్డం సమ్మయ్యకు వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన ముత్తిలింగం కుమార్తె శ్రీరంజినితో 1983లో వివాహం జరిగింది. సమ్మయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. పెద్దకుమారుడు సోమరాజు చిందు కళలోనే ఉన్నారు.

చిందు యక్షగాన కళా విభాగంలో పద్మశ్రీ పురస్కారం పొందిన సమ్మయ్య ముందు నుంచీ అనేక అవమానాలు, వెక్కిరింపులను ఎదుర్కొన్నారు. చిన్న వయస్సులో వేదికలు ఎక్కి ప్రదర్శనలు ఇవ్వడం, స్త్రీ పాత్రల్లో నటించడం కారణంగా ఒత్తుగా జుట్టు పెంచుకోవాల్సి వచ్చేది. ఈ క్రమంలో పలు చోట్లకు వెళ్లినప్పుడు అవమానాలు ఎదురైన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ నమ్ముకున్న కళను బతికిస్తూనే ఆసక్తి ఉన్న యువకులకు శిక్షణ ఇస్తూ ఆయన జాతీయ స్థాయిలో ఎదిగారు.

- 2017లోనే 'పద్మశ్రీ' ప్రతిపాదిత జాబితాలో చోటు
- జనగామ జిల్లాకు చెందిన గడ్డం సమ్మయ్యకు 2017లోనే పద్మశ్రీ పురస్కారం చేజారింది. అప్పట్లో రాష్ట్రం నుంచి పద్మశ్రీ పురస్కారాలకు తెలంగాణ నుంచి 47 మంది పేర్లను కేంద్రానికి పంపగా అందులో సమ్మయ్య పేరు ఉంది. కానీ.. అప్పట్లో చేజారిన పురస్కారం ఇప్పుడు వరించింది.
- ప్రదర్శనలు, సన్మానాలు, పురస్కారాలు
- 1985లో జనగామ మునిసిపల్ కార్యాలయంలో తెలుగు విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో ఒగ్గుకథా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహాభారతంలోని 'కీచక వధ' అనే పౌరాణిక ఘట్టాన్ని అద్భుతంగా ప్రదర్శించగా అప్పటి మంత్రుల చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు.
- 1998లో నెహ్రూ యువకేంద్రం ద్వారా కళా ప్రదర్శనలు ఇచ్చే అవకాశం లభించింది.
- 9 మంది బృందంతో జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చారు. 1991లో ఆలిండియా రేడియోలో 80 ప్రదర్శనలు, దూరదర్శన్‌లో 90 ప్రదర్శనలిచ్చారు.
- సాంస్కృతిక, పర్యాటక శాఖలో సుమారు 4000 ప్రదర్శనలు ఇవ్వడమే కాకుండా ఢిల్లీ, ఒడిషా, మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లోనూ అనేక ప్రదర్శనలు ఇచ్చారు. కాగా.. సమ్మయ్య సేవలకు గాను 2009లో ఆయన 'కళారత్న' బిరుదును అందుకున్నారు.

మేడారంలో ఆర్‌డబ్ల్యూఎస్ పనులు ముమ్మరం

14.5 కోట్లతో భక్తులకు సౌకర్యాల కల్పన





మేడారంలో తాత్కాలికంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లు, బోరుబావులను ఎయిర్ ప్రెసింగ్ చేస్తున్న సిబ్బంది

మేడారం, జనవరి 25 : మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు తరలి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 75 కోట్లు మంజూరు చేసింది. పనుల బాధ్యతలను వివిధ శాఖలకు కేటాయించింది. ఇందులో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ రూ. 14.5 కోట్లతో ఆయా పనులు చేపడుతోంది. 5,600 తాత్కాలిక మరుగుదొడ్లు, జంపన్నవాగులోని ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో పూడికతీత, 42 మోటార్ల ద్వారా 14 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఏడు వాటర్ ట్యాంకులకు నీటి సరఫరా చేసే పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ ట్యాంక్‌ల నుంచి పార్కింగ్, అడవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 555 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌కు నీటిని సరఫరా చేసి భక్తులకు అందించనున్నారు. 15కిలో మీటర్ల పైప్‌లైన్లు, 400 చేతి పంపుల మరమ్మతులు చేపడుతున్నారు. బోర్ బావుల ఎయిర్ ప్రెసింగ్, ఊట బావుల ప్రెసింగ్, తాత్కాలిక మురుగుదొడ్లకు నీటి సరఫరా, క్యూలైన్ల ద్ద తాగునీటి సౌకర్యం, నీటి శుద్ధీకరణ పనులు సాగుతున్నాయి. అలాగే మేడారంలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల వసతిని ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టే పనులను ఈనెల 31లోగా పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. దీంతో పనులు వేగవంతమై 70శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

రోజుకు 50లక్షల లీటర్ల తాగునీరు

మేడారం మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులు జరగనుంది. సుమారు కోటిన్నర మంది భక్తులు రానున్నట్లు అధికారులు అంచానాలు వేశారు. అందుకు ప్రణాళికలు సిద్ధం చేసి సౌకర్యాలు కల్పిస్తున్నారు. భక్తులకు తాగునీటి సమస్య తలెత్త కుండా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పనులు చేపడుతోంది. ఊరట్టం వద్ద 2 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు, ఊరట్టం క్రాస్ వద్ద 4 లక్షల లీటర్లు, పగిడిద్దరాజు షెడ్ వద్ద 2 లక్షల లీటర్లు, హరిత హోటల్ వద్ద లక్ష లీటర్లు, గిరిజన బాలికల ఆశ్రమ ఇంగ్లిష్ మీడియం పాఠశాల వద్ద 2.5 లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు వాటర్ ట్యాంకులు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద 2 లక్షల లీటర్ల ట్యాంకు, గద్దెల ఎదుట అతిథి భవనాల వద్ద 50వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వీటికి భగీరథ, జంపన్నవాగు ఊట బావుల నుంచి మోటార్ ద్వారా నీటినిసరఫరా చేయనున్నారు. క్యూలైన్లు, జంపన్నవాగు నుంచి గద్దెల వరకు రహదారి మీదుగా, మేడారం, రెడ్డిగూడెం, కొత్తూరు, ఊరట్టం, కన్నెపల్లి పరిసర గ్రామాల్లో భక్తులు విడిది చేసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బీవోటీలకు నీటిని పంపిణీ చేయనున్నారు. రోజుకు 50లక్షల లీటర్లకు పైగా తాగు నీరు భక్తులకు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సకాలంలో అందుబాటులో ఉంచుతాం

కె.మల్లేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

మహాజాతరలో భక్తులకు సౌకర్యాలను సకాలంలో అందుబా టులో ఉంచుతాం. మా శాఖ ద్వారా తాగునీరు సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, చేతిపంపుల మరమ్మతులు తదితర పనులు చేపడుతున్నాం. అవి చివరి దశకు చేరుకున్నాయి. ఈనెల 31లోగా పూర్తి చేస్తాం. ముందస్తుగా వస్తున్న భక్తులకు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

రాజ్యాంగమే దేశ రక్షణకు కవచం

రాజ్యాంగ సద్భావన ర్యాలీలో ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న హరికోట్ల రవి

వడ్డెపల్లి, జనవరి 25 : భారత రాజ్యాంగమే దేశ రక్షణకు కవచమని వరంగల్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి అన్నారు. ఓటర్ల దినోత్సవం, గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ మాల మహానాడు, వివిధ కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ ములుగురోడ్‌లోని మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వరకు భారత రాజ్యాంగ సద్భావన ర్యాలీని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి ర్యాలీలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. ప్రపంచంలోని అన్ని దేశాల కంటే భారతదేశం అత్యంత పెద్ద ప్రజాస్వామిక దేశమని అన్నారు. మన దేశానికి రాజ్యాంగం అవసరమైనప్పుడు దేశంలో మేధావిగా ఉన్న అంబేద్కర్ రాజ్యాంగాన్ని తన భుజస్కంధాలపై వేసుకొని ప్రజాస్వామ్యదేశానికి రాజ్యాంగాన్ని అందించిన గొప్ప మేధావి అని కొనియాడారు. రాజ్యాంగంలో అన్ని వర్గాలకు, వ్యవస్థలకు సమానమైన హక్కులు కల్పించారని అన్నారు. గ్రామగ్రామాన రాజ్యాంగంలోని గొప్పతనాన్ని వివరించాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా పొందిన ఓటు హక్కును ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా సమాజంలోని పౌరులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, పొలిట్ బ్యూరో చైర్మన్ అసోదా భాస్కర్, రాష్ట్ర అధికార ప్రతినిధి నీరటి రాములు, బీసీ నాయకులు క్రాంతి, ప్రవీణ్, వెంకన్న, మాల మహానాడు నేతలు అంకేశ్వరపు రాంచందర్‌రావు, బొల్లం రామ్‌కుమార్, నాగరాజు, ఉదయ్, పొనుగంటి లక్ష్మీనారాయణ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

కేయూ హాస్టల్స్ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా రజిత

కేయూ క్యాంపస్, జనవరి 25: కాకతీయ యూనివర్సిటీ హాస్టల్స్ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా రజితను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశా రు. ఇటీవల ఏసీబీ దాడుల్లో లంచం తీసుకుంటూ పట్టుబడిన ఏఆర్ క్రిష్ణయ్య వర్సిటీ హాస్టల్స్ ఆఫీస్‌లో పనిచేసేవారు. క్రిష్ణయ్య సస్పెన్షన్ తర్వాత వర్సిటీ హాస్టల్స్ ఆఫీస్‌లో ఏఆర్, సూపరింటెండెంట్‌ను నియమించకపోవడంతో పరిపాలనపరమైన ఇబ్బందులు తలెత్తాయి. దీంతో వర్సిటీ పరిపాలన అధికారులు రజితను నియమించారు.

కేయూకు ఐసెట్-24 నిర్వహణ

జూన్ 4, 5 తేదీల్లో పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 25: 2024-25 ఏడాదికిగాను రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే టీఎస్ఐసెట్-24 నిర్వహణ బాధ్యతలు ఈ దఫా మళ్లీ కేయూకే దక్కింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రవేశ పరీక్షలకు షెడ్యూల్‌ను ప్రకటించారు. షెడ్యూల్‌లో భాగంగా ఈ దఫా వరంగల్ కాకతీయ యూనివర్సిటీకే టీఎస్ఐసెట్-24 నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి వరుసగా పదిసార్లు కాకతీయ యూనివర్సిటీకే టీఎస్ఐసెట్ బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 4, 5 తేదీల్లో టీఎస్ఐసెట్-24 ప్రవేశ పరీక్షల నిర్వహిస్తామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి షెడ్యూల్‌ను ప్రకటించింది. కాకతీయ యూనివర్సిటీకే టీఎస్ఐసెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించడంపై వర్సిటీ ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

చిత్రహింసలు పెట్టి చంపారని మృతురాలి బంధువుల ఆందోళన



ప్రవీణ్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు



స్వరూప (ఫైల్)

చెన్నారావుపేట, జనవరి 25: భర్త వేధింపులు తాళలేక భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని జల్లి తండాలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే తండాకు చెందిన జర్పుల ప్రవీణ్‌కు ముగ్దుంపురం తండాకు చెందిన భూక్య మల్లికాం బ- లాక దంపతుల కుమార్తె స్వరూప(40)తో 24 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి కుమారుడు వంశీ, కుమార్తె చందనలున్నారు. కుమారుడు వంశీ 5 నెలల కిందట ప్రేమం వివాహం చేసుకున్నాడు. మృతురాలి భర్త ప్రవీణ్ ప్రతీ రోజు మద్యం తాగి వచ్చి భార్య స్వరూపను తిడుతూ, కొడుతూ వేధించేవాడు. ఈ విషయంలో స్వరూప గతంలో రెండుసార్లు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నం చేసింది. అలాగే కుమారుడు వంశీ ప్రేమ వివాహం విషయంలోనూ భార్య స్వరూపను తరుచూ వేధింపులకు గురిచేస్తున్నాడు. కాగా, బుధవారం సాయంత్రం భర్త ప్రవీణ్ భార్య స్వరూపతో మళ్లీ గొడవ జరిగింది. నానాబూతులు తిడుతూ స్వరూపు తిట్టి కొట్టాడు. దీంతో తీవ్ర మనస్తాపంతో స్వరూప పురుగుల మందు ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే చుట్టుపక్కలవారు గమనించి చికిత్స నిమిత్తం గమనించి చికిత్స కోసం నర్సంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లి మల్లికాంబ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నెక్కొండ సీఐ హతీరాంనాయక్, ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

కాగా జర్పుల ప్రవీణ్ తన కూతురు స్వరూపను నిత్యం మద్యం సేవించి వచ్చి వేధింపులకు గురి చేసేవాడని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. అంతేకాకుండా కూతురు శరీరంపై గాయాలున్నాయని అతడిపై చర్యలు తీసుకోవాలని ప్రవీణ్ ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రవీణ్ కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాలకు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఎలాంటి గొడవలు కాకుండా స్వరూప అంత్యక్రియలను నిర్వహించారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

వనదేవతలకు కొనసాగుతున్న మొక్కులు

మేడారం, జనవరి 25 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఫిబ్రవరి 21 నుంచి మహాజాతర జరగనుండగా వివిధ ప్రాంతాల నుంచి గురువారం భారీ సంఖ్యలో తరలి వచ్చి ముందస్తుగా తల్లులను దర్శించుకున్నారు. సుమారు లక్షల మంది వనదేవతలకు మొక్కులు సమర్పించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించుకున్నారు. చల్లగా చూడాలని తల్లులను మొక్కుకున్నారు.

ప్రేమ విఫలమై మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

మృతుడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాసి

హనుమకొండ క్రైం, జనవరి 25: క్రిమిసంహారక మందు తాగి చికిత్స పొందుతూ చెక్క శ్రీకాంత్ (26) అనే యువకుడు బుధవారం రాత్రి మృతి చెందాడు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల గ్రామానికి చెందిన శ్రీకాంత్ కొంతకాలంగా హనుమకొండ పోచమ్మకుంటలో ఉంటూ ములుగురోడ్డులోని అజరా ఆస్పత్రిలో ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్లుగా హనుమకొండలో ఉంటున్న ఓ యువతితో ప్రేమలోపడ్డాడు. సదరు యువతి శ్రీకాంత్ ప్రేమను నిరాకరించి ఇటీవల మరో వ్యక్తితో పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. దీంతో మనస్థాపం చెందిన శ్రీకాంత్.. ఈ నెల 20న భద్రకాళి చెరువు సమీపంలోని వెళ్లి క్రిమిసంహాకర మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అక్కడి వారు చూసి పోలీసులకు ఫోన్ చేయడంతో 108 సహాయంతో అజరా ఆస్పత్రిలో నాలుగు రోజులుగా చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు చెక్క సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. తన తమ్ముడి మృతికి ప్రేమేకారణమని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

దాడి కేసులో మూడేళ్ల జైలు శిక్ష

నర్సింహులపేట, జనవరి 25: దాడి కేసులో ఒకరికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ తొర్రూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సరిత తీర్పును గురువారం వెల్లడించారు. ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. జయపురంలో 2015లో ఇంటి ప్రహరీ విషయంలో నేలకుర్తి మోహన్‌రెడ్డి, నేలకుర్తి బుచ్చిరెడ్డి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో మోహన్‌రెడ్డి పారతో దాడి చేసిన ఘటనలో బుచ్చిరెడ్డి తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు క్షేత్రస్థాయిలో దర్యాప్తు జరిపి కోర్టుకు సమర్పించిన సాక్షాధారాలను విచారించిన జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సరిత నిందితుడు నేలకుర్తి మోహన్‌రెడ్డికి రూ.2వేలు జరిమానా విధిస్తూ, మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు తెలిపారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన సీఐ సత్యనారాయణ, ఎస్సై సతీష్, కోర్టు కానిస్టేబుల్ డీఎస్పీ వెంకటేశ్వరబాబు అభినందించారు.

దేవాలయాల్లో చోరీకి పాల్పడిన నిందితుల అరెస్టు



స్వాధీనం చేసుకున్న దేవుడి వాహన విగ్రహాలతో డీఎస్పీ వెంకటేశ్వరబాబు, పోలీసు అధికారులు

తొర్రూరు, జనవరి 25 : తొర్రూరు డివిజన్ పరిధిలోని మరిపెడ, తొర్రూరు, దంతాలపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరబాబు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. వారు మహబూబాబాద్ జిల్లాలో దంతాలపల్లి మండలం పెద్దముప్పారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, తొర్రూరు మండలం మాటేడు వేణుగోపాలస్వామి, అమ్మాపురం సీతారామచంద్రస్వామి, మరిపెడ మండలం గుండెపుడిలోని సీతారామస్వామి ఆలయాల్లో దేవుడి విగ్రహాలను ఊరేగింపు సమయంలో చేపట్టే ఉత్సవవిగ్రహాలు, గరుడవాహనం, అశ్వ వాహనం, ఇత్తడి గొడుగు, దివిటీలు దొంగిలించేవారు. నకిరేకల్ మండల కేంద్రానికి చెందిన చింతల పుల్లారావు అనే పాత ఇనుప సామాను కొనుగోలు వ్యక్తికి విక్రయిస్తారు.

మరిపెడ మండలంలోని ఎల్లంపేట శివారు జమ్మికుంట తండాలో ట్రాన్స్‌ఫారం, కాపర్ వైరు కూడా దొంగిలించి విక్రయించగా గుండెపుడి ఆలయ ఆవరణలో దొంగతనం చేసినపుడు పోలీసులు విచారణ చేపట్టగా మహిళలు కూడా ఈ దొంగతనం చేసినట్లు గుర్తించి డివిజన్ పరిధిలోని సీఐల ఆదేశాల మేరకు పోలీసులు టీమ్‌గా ఏర్పడి విచారణ చేపట్టారు. నిందితులు ఉపయోగించిన ఆటో సీసీ కెమెరాలో కనిపించడంతో గురువారం తొర్రూరు ఎస్సై సతీష్ వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులు ఆవుల సంజీవ, నాగిళ్ల నాగరాజు, ఎడ్ల వెంకటమ్మ, ఎడ్ల పున్నమ్మ, నాగిళ్ల దుర్గ, గోపగాని రాజమ్మ ఆరుగురు చింతల పుల్లారావుతో కలిసి వెళ్తుండడంతో సమాచారం మేరకు పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరి వద్ద నుంచి రూ.60 వేల నగదు, రెండు క్వింటాల ఇత్తడి విగ్రహాలు, కాపర్‌వైరు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులకు డీఎస్పీ రివార్డులు అందజేశారు. సీఐ లు కరుణాసాగర్, సత్యనారాయణ, ఎస్సైలు సతీష్, తహేర్‌బాబా, జగదీష్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

కమలాపూర్, జనవరి 25: కమలాపూర్ మండలంలోని భీంపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న జె.విజయ అనే ఉపాధ్యాయురాలిని గురువారం విధుల నుంచి సస్పెండ్ చేశామని మండల విద్యాధికారి రాంకిషన్‌రాజు తెలిపారు. విధుల పట్ల ఉపాధ్యాయురాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, విద్యార్థులకు సరిగా పాఠాలు చెప్పడంలేదని, విధులకు సక్రమంగా హాజరుకావడంలేదని, పాఠశాలలోని తోటి ఉపాధ్యాయులను, ఎస్‌ఎంసీ చైర్మన్‌ను, సర్పంచ్‌ను, గ్రామస్థులను అసభ్య పదజాలంతో దూషించిందన్నారు. దీంతో ఉపాధ్యాయురాలిపై టీపీటీఎఫ్ నాయకులు, ఎస్‌ఎంసీ చైర్మన్, గ్రామ సర్పంచ్, పీటీఏలు ఫిర్యాదు చేయడంతో జిల్లా విద్యాధికారి ఎమ్డీ అబ్దుల్‌హై విచారణకు ఆదేశించారని ఆయన తెలిపారు. డీఈవో ఆదేశాల మేరకు ఈనెల 22న పాఠశాలలో విచారణ జరిపామని ఆయన తెలిపారు. విచారణ నివేదికను జిల్లా విద్యాధికారికి సమర్పించడంతో నివేదిక ఆధారంగా ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీ చేశారని ఆయన తెలిపారు.

పుష్‌పుల్ రైలు ఢీకొని విధుల్లో ఉన్న కీమెన్ మృతి



మృతుడు కీమెన్ రాజు



సంఘటనకు ముందు కీమెన్ రాజు

గిర్మాజిపేట, జనవరి 25 : విధి నిర్వహణలో భాగంగా రైల్వేట్రాక్ చెక్ చేస్తున్న రైల్వే కీమెన్ వల్లెపు రాజు (38) పుష్‌పుల్ రైలు ఢీకొని దుర్మరణం చెందిన విషాద ఘటన గురువారం వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. వరంగల్ జీఆర్పీ సీఐ జి.నరేష్ విలేఖరులకు తెలిపిన ప్రకారం ఈ సంఘటనా వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ రైల్వేస్టేషన్‌లోని సీనియర్ సెక్షన్ ఇంజనీయర్ 3వ యూనిట్‌లో పనిచేస్తున్న కీమెన్ వల్లెపు రాజు రోజు వారి డ్యూటీలో భాగంగా గురువారం ఉదయం డ్యూటీ ఎక్కాడు. విధి నిర్వహణలో భాగంగా రాజు మూడో లైన్ ట్రాక్ చెక్ చేస్తు చింతల్‌పల్లి వైపు ట్రాక్‌పై బయలుదేరాడు. ఉదయం గంటల ప్రాంతంలో వంచనగిరి రైల్వేగేటు సమీపంలో వరంగల్ నుంచి డోర్నకల్ వెళ్తున్న పుష్‌పుల్ రైలు వెనుక నుంచి ఢీ కొట్టింది. పొగమంచు కారణంగా రైలు రాకను ఆలస్యంగా గుర్తించిన రాజు, రైలు హారన్ విని పక్కకు వెళ్లేందుకు కంకర కుప్ప ఎక్కగా జారడంతో రైలు ఢీ కొట్టింది. అదే సమయంలో డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తున్న రైల్వే పోర్టర్ కుమారస్వామి మృతుడు తన సోదరుడు రాజుగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చాడు. ఎస్సై ఎం.అయిలయ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్ తెలిపారు. తండ్రి స్వచ్ఛంద పదవి విరమణ స్థానంలో రాజు కీమెన్‌గా ఉద్యోగం చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య కవిత, కుమారుడు, కూతురు, తల్లిదండ్రులు ఉన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి

» మాజీ డీజీపీకి అత్యంత కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకంలో అత్యంత కీలకమైన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కు కొత్త సారథి వచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరుసగా ప్రశ్నపత్రాల లీకేజీతో అప్రదిష్టపాలైన సంస్థకు.. రిటైర్డ్ పోలీస్ బాస్ అధిపతిగా నియమితులయ్యారు. ఎన్నికల్లో ప్రకటించిన విధంగా.. కమిషన్‌ను ప్రక్షాళన చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి అడుగువేసింది. టీఎస్‌పీఎస్సీ పగ్గాలను మాజీ డీజీపీ ముదిరెడ్డి మహేందర్‌రెడ్డికి అప్పగించింది. సభ్యులుగా రిటైర్డ్ ఐఏఎస్ అనితారాజేంద్ర, ఇండియన్ పోస్టల్ సర్వీస్ రిటైర్డ్ అధికారి అమీర్ ఉల్లాఖాన్, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ నర్రి యాదయ్య, విద్యుత్తు శాఖకు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యరబడి రామ్మోహన్ రావు, కాంగ్రెస్ నాయకురాలు పాల్వాయి రజనీకుమారిని నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు గవర్నర్ తమిళిసై గురువారం ఆమోదం తెలిపారు. ఆ వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కాగా, చైర్మన్, సభ్యులు

పదవీ బాధ్యతలు చేపట్టిన తేదీ నుంచి ఆరేళ్ల పాటు లేదా 62 ఏళ్ల వయసు నిండేలోపు పదవుల్లో ఉంటారు. ఈ నిబంధనల్లో ఏది ముందు వర్తిస్తే అది అమలవుతుంది. మరోవైపు ఈ ఆరుగురిలో ఓసీ, బీసీ సామాజికవర్గాలకు చెందినవారు ఇద్దరు ఉండగా, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించారు. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌తో కలిపి మొత్తం 11 మందిని నియమించవచ్చు. ప్రస్తుతం చేపట్టినవి పోగా.. ఇంకా ఐదుగురిని నియమించే అవకాశం ఉంది. వీటిపైనా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

భుజాలపై చాలా పెద్ద బాధ్యత

బీఆర్ఎస్ హయాంలో టీఎస్‌పీఎస్సీ తీవ్ర విమర్శలకు గురైంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం సంస్థ పేరును మసకబార్చింది. నిరుద్యోగుల ఆత్మహత్యల నేపథ్యంలో కమిషన్ దోషిగా నిలవాల్సి వచ్చింది. దీంతో అప్పటి చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సభ్యులు రాజీనామా చేయాలంటూ విపక్ష నేతలు, ఓయూ విద్యార్థి సంఘాలు, నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. అయినా, బీఆర్ఎస్ ప్రభుత్వం వారిని కొనసాగించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. జనార్దనరెడ్డి, నలుగురు సభ్యులు వైదొలగారు. మిగతా ఇద్దరిలో ఒకరు ఇటీవల రాజీనామాను గవర్నర్‌కు పంపారు. మరొకరు ఇంకా వైదొలగలేదు. కాగా, టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రకటించారు. కొత్త కమిషన్ ఏర్పాటయ్యాక ఏడాది లోపు 2 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. టీఎస్‌పీఎస్సీ పారదర్శకంగా, పకడ్బందీగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డితో పాటు సభ్యులపై చాలా పెద్ద బాధ్యత ఉంది.



వ్యవసాయ కుటుంబం..

మహేందర్‌రెడ్డిది ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కిష్టాపురం గ్రామం. వ్యవసాయ కుటుంబానికి చెందిన నారాయణరెడ్డి, అచ్చమ్మలకు 1962 డిసెంబరు 3న జన్మించారు. నల్లగొండ జిల్లా సర్వేల్ గురుకులంలో ప్రాథమిక, కూసుమంచిలో హైస్కూల్ విద్యను అభ్యసించారు. నాగార్జున సాగర్ గురుకుల కళాశాలలో ఇంటర్, వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ (ఆర్ఈసీ) నుంచి 1984లో బీటెక్ సివిల్ పూర్తి చేశారు. ఢిల్లీ ఐఐటీలో ఎంటెక్ చదివారు. 1986లో మొదటి ప్రయత్నంలోనే సివిల్స్ సాధించారు. విశాఖపట్నం, గోదావరిఖని, గుంటూరులో ఏఎస్పీగా, బెల్లంపల్లి అడిషనల్ ఎస్పీగా, నిజామాబాద్, కర్నూలు జిల్లాల్లో ఎస్పీగా పనిచేశారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో ఈస్ట్ జోన్ డీసీపీ, జాతీయ పోలీస్ అకాడమీలో అసిస్టెంట్, డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలందించారు. 2003-07 మధ్య సైబరాబాద్ కమిషనర్‌గా కొనసాగారు. గ్రేహౌండ్స్, ఇంటిలిజెన్స్ చీఫ్‌గా చేసిన మహేందర్‌రెడ్డి 2014-17 నడుమ హైదరాబాద్ సీపీగా, 2017-22లో డీజీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. పోలీసింగ్‌లో టెక్నాలజీకి పెద్దపీట వేశారు.

విద్యావంతుల ఇంటి నుంచి..



హైదరాబాద్ జూబ్లీ హిల్స్ ఫిల్మ్‌నగర్‌కు చెందిన 58 ఏళ్ల అమీర్ ఉల్లాఖాన్‌ది వీరిది విద్యావంతుల కుటుంబం. 1983 బ్యాచ్ ఇండియన్ పోస్టల్ సర్వీసు అధికారి. 1995లో వీఆర్ఎస్ తీసుకున్నారు. తర్వాత కేంద్ర ఆర్థిక శాఖ, యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(యూఎన్‌డీపీ)లో పనిచేశారు. ఉర్దూ వర్సిటీ, ఐఎస్‌బీ, నల్సార్, ఎంసీహెచ్ఆర్‌డీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. విద్య, ఆర్థిక రంగాలపై కథనాలు రాశారు.

ఉత్తమ అధికారిగా..



రిటైర్డ్ ఐఏఎస్ అనితారాజేంద్ర ఓయూలో ఎంఏ, ఎల్ఎల్ఎం చదివారు. 1963 ఫిబ్రవరి 4న జన్మించారు. 1998లో సివిల్స్ సాధించారు. 2011-12లో మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా, 2012లో ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా, 2013-14లో ఏపీఐడీసీ వీసీ అండ్ ఎండీగా, 2015లో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా, 2015-18లో హోం శాఖ కార్యదర్శిగా, 2018-20లో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా, 2020-22లో పశు సంవర్ధక శాఖ కార్యదర్శిగా పనిచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రెండుసార్లు అవార్డు పొందారు. అనితా గౌడ వర్గానికి చెందినవారు.

విద్యుత్తు శాఖ నుంచి..



విద్యుత్తు శాఖలోని జల విద్యుత్తు విభాగంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు యరబడి రామ్మోహన్‌రావు. ఎరుకల (ఎస్టీ) సామాజిక వర్గానికి చెందినవారు. 1963లో జన్మించిన ఆయన 1984లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బీఈ చదివారు.

సీనియర్ ప్రొఫెసర్..



యాదయ్య 1964 ఫిబ్రవరి 10న జన్మించారు. జేఎన్‌టీయూహెచ్‌లో ఎలక్ట్రానిక్స్ సీనియర్ ప్రొఫెసర్. 1988లో బీఈ, 1991లో ఎంటెక్, 2000లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2008-12 వరకు జేఎన్‌టీయూలోని ఈఈఈ విభాగం హెచ్‌వోడీగా, 2013-14లో సీఈహెచ్ విభాగం వైస్ ప్రిన్సిపల్‌గా, 2014-15లో ప్రిన్సిపల్‌గా, 2015-19 వరకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఎంసెట్ కన్వీనర్‌గా పనిచేశారు. ఈయన కురుమ వర్గానికి చెందినవారు.

గ్రూప్-1 కొలువు వదిలి..



దళిత వర్గానికి చెందిన రజనీ 1972లో జన్మించారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎల్ఎల్‌బీ, బీఈడీ చదివారు. 2000 సంవత్సరంలో గ్రూప్-1 సాధించారు. 2004 వరకు ఖైరతాబాద్ సర్కిల్ మునిసిపల్ కమిషనర్‌గా పని చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఉమ్మడి ఏపీ సీఎంగా ఉండగా.. ఆయన ప్రోత్సాహంతో టీడీపీలో చేరారు. ఆ ఏడాది సూర్యాపేటలో, 2014లో తుంగతుర్తి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2023 అక్టోబరు 18న రేవంత్‌రెడ్డి పిలుపుతో కాంగ్రెస్‌లో చేరారు.



ఇక.. వేగంగా పోస్టుల భర్తీ!

» టీఎస్‌పీఎస్సీకి కొత్త రూపుతో ఉద్యోగార్థుల్లో ఆశాభావం

» ప్రభుత్వ చొరవపై హర్షం

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)ను గాడిన పెట్టే అంశంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ పట్ల ఉద్యోగార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చైర్మన్, సభ్యులను నియమించి టీఎస్‌పీఎస్సీకి కొత్త రూపు తీసుకురావడంతో ఇక ఉద్యోగాల భర్తీనే తరువాయి అని ఆశగా ఎదురు చూస్తున్నారు. నిజానికి, గత ప్రభుత్వ హయాంలో టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2 సహా వివిధ పోస్టులకు పరీక్షలు జరిగాయి. కానీ, పేపర్ లీకేజీలు, పరీక్షకు హాజరైన అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకోకపోవడం తదితర కారణాల వల్ల ఆయా పరీక్షలు రద్దు అయ్యాయి. దీంతో టీఎస్‌పీఎస్సీ అప్రతిష్ఠ మూటకట్టుకోగా ఉద్యోగార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై నిరుద్యోగులకు హామీనిచ్చింది. అధికారం చేపట్టిన వెంటనే బోర్డును ప్రక్షాళన చేసి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని స్పష్టం చేసింది. ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై దృష్టి సారించింది. చైర్మన్, సభ్యుల ఎంపిక కోసం అనుభవజ్ఞులు, మేధావులతో ఓ కమిషన్ ఏర్పాటు చేసింది. అలాగే, వివిధ రాష్ట్రాల్లోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పనితీరు అధ్యయనానికి ఐఏఎస్ అధికారులను రెండు బృందాలుగా కేరళ, ఢిల్లీ పంపింది. ఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహణపై ప్రత్యేకంగా అధ్యయనం చేయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా యూపీఎస్సీ అధికారులతో స్వయంగా మాట్లాడారు. మొత్తంగా రాజకీయ ప్రమేయం లేకుండా చైర్మన్, సభ్యులను ఎంపిక చేసి జాబితాను గవర్నర్‌కు పంపగా వెంటనే ఆమోదం లభించింది. దీంతో కమిషన్ పూర్తి స్థాయిలో ఏర్పాటైంది. దీంతో ఉద్యోగాల భర్తీ ఇక పారదర్శకంగా జరుగుతుందని ఉద్యోగార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నియామకాల్లో సామాజిక న్యాయం

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకం విషయంలో దాదాపు అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం దక్కింది. చైర్మన్‌గా నియమితులైన మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి ఓపెన్ కేటగిరి, రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు. గౌడ సామాజిక వర్గానికి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అనితా రామచంద్రన్, కుర్మ కులానికి చెందిన నర్రి యాదయ్య, ఎస్టీ (ఎరుకుల) సామాజిక వర్గానికి చెందిన రామ్మోహన్ రావు, ఎస్సీ (మాదిగ) సామాజిక వర్గానికి చెందిన గ్రూప్-1 అధికారిగా పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న పాల్వాయి రజని, ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో పని చేసిన అమీరుల్లాఖాన్ (ముస్లిం మైనార్టీ కోటాలో) సభ్యులుగా నియమితులయ్యారు. వీరంతా ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పని చేశారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్
- జిల్లా వ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవం



మరిపెడలో ఓటరు అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు


మానుకోటలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు

మహబూబాబాద్ టౌన్, జనవరి 25 : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కును ప్రతీ ఒక్కరు ఆయుధంగా మలచుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన యువతీయువకులు విధిగా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని, ఓటు హక్కుఉన్న ప్రతీ ఒక్కరు ఎన్నికల్లో వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఓటు విశిష్టతపై పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వకృత్వం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. నూతన ఓటర్లకు ఎపిక్ కార్డులు అందించి సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. తొలుత ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవో అలివేలు, జిల్లా అధికారులు సన్యాసయ్య సుబ్బారావు,లక్ష్మీనారాయణ, సన్యాసయ్య, రామారావు, రామకృష్ణ, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

● మునిసిపల్ 24 వవార్డు పరిధిలోని ఇంద్రానగర్ స్కూల్‌లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు, సీనియర్ ఓటర్లను శాలువాలతో సత్కరించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. స్థానిక వార్డు కౌన్సిలర్ మార్నేని వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆర్డీవో అలివేలు, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నారాణి, మార్నేని కిరణ్, మాదరబోయిన యాకయ్య, సల్వాది దిలీప్, గోపాల్, బీఎల్‌వో స్నేహబిందు పాల్గొన్నారు.

● ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.రాజు, బి.వెంకటేశ్వర్లు, రామరత్నమాల, టి.యుగేందర్, బొంద్యాలు, వేణుగోపాల్, శశికాంత్, మల్లేశం, నరహరి, ఉపేందర్, సంతోష్‌రెడ్డి, సుమలత పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

మహబూబాబాద్ ఇస్లావత్‌తండా (ఎస్)లో సర్పంచ్ బోడ లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ ఓటర్లను సత్కరించారు.

● తొర్రూరులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో క్రీడా పోటీలు, ఓటుహక్కుపై అవగాహన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. మునిసిపల్ ఆవరణలో ఓటుహక్కుపై సదస్సు జరిపారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ వినోద్‌కుమార్, ప్రిన్సిపల్ రాములు, మునిసిపల్ కమిషనర్ సరస్వతి, చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● మరిపెడ మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సింధూరకుమారి, కమిషనర్ రాజు, కౌన్సిలర్లు, అధికారులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొని నూతన, సీనియర్ ఓటర్లను సత్కరించారు. రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు హాజరై ర్యాలీని ప్రారంభించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో ధన్‌సింగ్, ఎంపీపీ అరుణరాంబాబు, జడ్పీటీసీ శారదరవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

● దంతాలపల్లిలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు,ఆర్ఐ నజీముద్దీన్, ఎంఈవో రాము, హెచ్ఎం వేణుమాధవ్ పాల్గొన్నారు.

● పెద్దవంగరలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.మహేందర్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ వి.లక్ష్మి, ఎస్సై పి.రాజు, వి.రాంచంద్రయ్య శర్మ, హెచ్ఎం శ్రీనివాస్, కార్యదర్శి వెంకన్న పాల్గొన్నారు.

● గార్ల మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ స్వాతిబిందు, ఎంపీడీవో రవీందర్, ఏవో కావటి రామారావు, కళాశాల ప్రిన్సిపల్ రూపన్ గోవిందరావు,ఎస్సై జినిత్ కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

● డోర్నకల్ రైల్వే సెంటర్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తహసీల్దార్ నాగభవాని, డీటీ వీరన్న, సెర్ప్ ఏపీఎం శంకర్‌నాయక్, కార్యదర్శులు, సీసీలు పాల్గొన్నారు.

● నెల్లికుదురు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఓటరు దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీలు నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. మండల కేంద్రంలో ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. ఆయా వేడుకల్లో ఎంపీపీ ఎర్రబెల్లి మాదవి తహసీల్దార్ రాజు, ఎంపీడీవో శేషాద్రి, ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

● గూడూరులో సీనియర్, నూతనంగా ఓటు హక్కు పొందిన వారిని ఘనంగా సన్మానించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, నయాబ్ తహసీల్దార్ కోమల, ఆర్ఐ మల్లయ్య, హెచ్ఎం బిక్షపతి. ఏఎస్ఐ శ్యాంసుందర్, కార్యదర్శులు బీమా, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

● తొర్రూరు మండలం చర్లపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఓటర్ల దినోత్సవ కార్య క్రమంలో హెచ్ఎం బుచ్చయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కురవిలో గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి వీరభద్రస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను, దివ్యాంగ ఓటర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎస్సై గోపి, ఎంపీడీవో సరస్వతి, బీఎల్వోలు అరుణ, నర్సయ్య, అప్పల రాజేందర్ పాల్గొన్నారు.

● బయ్యారంలో ఓటరు దినోత్సవ కార్యక్రమం జరిగింది. తొలుత ర్యాలీ నిర్వహించి, గాంధీ సెంటర్‌లోని క్రీడామైదానంలో ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ ఇమానియల్, ఎంపీడీవో సత్యనారాయణ, అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురు పోలీసులకు రాష్ట్రస్థాయి సేవా పతకాలు


పతకాలకు ఎంపికైన ఏఎస్సైలు షేక్ అహ్మద్, జడల సదయ్య

మహబూబాబాద్ రూరల్, జనవరి 25 : జిల్లాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ముగ్గురు పోలీస్ అధికారులకు రాష్ట్రస్థాయిలో సేవా పతకాలకు ఎంపికయ్యారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్ కంట్రోల్ రూంలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై షేక్. అహ్మద్, జిల్లా పోలీస్ కార్యాలయం పీసీఆర్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎండి సత్తార్, కురవి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జడల సదయ్యలు విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ ముగ్గురు పోలీసులకు రాష్ట్రస్థాయి సేవ పథకాలు వరించాయి. త్వరలో ఈ ముగ్గురు అధికారులు రాష్ట్ర డీజీపీ రవిగుప్తా, హోంశాఖ మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పతకాలతో పాటు నగదు పురస్కారం అందుకోనున్నారు.

ఎమ్మెల్సీగా కోదండరాం నియామకంతో..

మానుకోటలో టీజేఎస్ సంబురాలు


బాణసంచా కాల్చుతున్న టీజేఎస్ నేతలు, తెలంగాణ ఉద్యమకారులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 25 : గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా తెలంగాణ జన సమితి (టీజేఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం నియామకంతో మహబూబాబాద్ పట్టణంలో గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బాణాసంచాలు కాల్చిస్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ప్రజలకు దక్కిన గౌరవమని చెప్పారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన కోదండరాంకు సముచిత గౌరవం దక్కిందన్నారు. ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన సీఎం రేవం త్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పిల్లి సుధాకర్, మైస శ్రీనివాస్, ఆరుద్ర పరమాత్మాచారి, ఖాజాపాషా, ఇరుగు మనోజ్‌కుమార్, చుంచు శ్రీశైలం, మామిడాల సత్యనారాయణ, బుర్ర గోవర్దన్, లక్ష్మణ్, పమ్మిరాజు, పి.సదానందం, కళ్లెం వీరారెడ్డి, కృష్ణ ప్రసాద్, కృష్ణారావు పాల్గొన్నారు.

● తెలంగాణ ఉద్యమనాయకులు ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి రావడం ఉద్యమానికి దక్కిన గౌరవమని తెలంగాణ ఉద్యమకారుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామారాజు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, జనవరి 25 : జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీ సమీపంలో ఐదు ఇళ్లను కూల్చిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై పవన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన తిపిరిశెట్టి ప్రసాద్ బీసీ కాలనీలో సర్వేనెంబర్ 274/4లో 151 గజాల స్థలాన్ని కర్నావత్ రాధాబాయి వద్ద 2014లో కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఆ స్థలంలో తిపిరిశెట్టి ప్రసాద్ ఇంటిని నిర్మిం చుకున్నాడు. గుండ్లబోడు తండాకు చెందిన గుగులోతు రాజు, బానోత్ విజయ్‌లు ఈనెల 24న జేసీబీ సాయంతో అకారణంగా 274/4లో ఐదు ఇండ్లను కూల్చివేశాడని చెప్పారు. దీంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో గుగులోతు రాజు, బానోత్ విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మొక్కజొన్న చేనును ధ్వంసం చేసిన కోతులు

కేసముద్రం, జనవరి 25 : అమినాపురంలో శేకిడి సతీష్‌కు చెందిన మొక్కజొన్న పంటను కోతులు ధ్వంసం చేసినట్లు బాధిత రైతు గురువారం తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో వేసిన మొక్కజొన్న చేను ఒకఫీటు ఎత్తు పెరగగా కోతుల గుంపుచేనులో పడిమొక్కలను పీకివేసినట్లు తెలిపారు. రూ.50వేల విలువైన సగానికిపైగా పంట దెబ్బతిన్నట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

'ఎన్నికలకు సంసిద్ధం కావాలి'

గూడూరు, జనవరి25 : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా బీజేపీ కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని జిల్లా నాయకుడు లింగాల సుధీర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి స్వగృహంలో గురువారం కిషన్‌రెడ్డిని కలిసి పుష్ప గుచ్చం అందించారు. ఆపై జిల్లాలోని బీజేపీ పటిష్టతపై వివరించారు.


ఏటిగడ్డ తండా వద్ద ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్, కమిషనర్, ఫ్లోర్ లీడర్లు

'నీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దు'

మహబూబాబాద్ టౌన్, జనవరి 25 : వచ్చేవేసవి కాలంలో తాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మానుకోట పట్టణ శివారులోని ఏటిగడ్డతండా వద్ద ఫిల్టర్‌బెడ్‌ను గురువారం అధికారులు, ఫ్లోర్‌లీడర్లతో కలిసి పరిశీలించారు. మోటార్ల పనితీరుపై ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దినదినాభివృద్ధి చెంది జిల్లా కేంద్రంగా ఆవిష్కృ తమై లక్ష జనాభాకు చేరువలో ఉన్న మానుకోట పట్టణంలో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా నీటి సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఫిల్టర్‌బెడ్ మోటారుల పనితీరును పరిశీలించి మరమ్మతులు చేయించాలన్నారు. వేసవిలో ఇబ్బందులు లేకుండా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా అందుతుందని పేర్కొన్నారు. కమిషనర్ ప్రసన్నారాణి, వైస్ చైర్మన్ ఫరీద్, డీఈ ఉపేందర్, ఏఈ సురేష్, ఫ్లోర్‌లీడర్లు చిట్యాల జనార్దన్, వెన్నం లక్ష్మారెడ్డి, సూర్నపు సోమయ్య, బి.అజయ్‌సారథిరెడ్డి, వార్డు కౌన్సిలర్లు మార్నేని వెంకన్న, బానోత్ పద్మాసీతారాం, దండెబోయిన బుజ్జివెంకన్న, పోతురాజు రాజు, దౌలాగర్ శంకర్, శివ పాల్గొన్నారు.

ఆటో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

డోర్నకల్, జనవరి 25 : మునిసిపల్ కేంద్రంలోని సుభాష్ వీధిలో చోరీకి గురైన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకుని, అపహరించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఉపేందర్‌రావు గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని సుభాష్ వీధికి చెందిన ఇల్లటూరి వీరస్వామి తన ఇంటి ముందు 21న రాత్రి పార్కింగ్ చేసిన ఆటోను ఉంచాడు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన షేక్.నవాబ్‌మున్వర్ అపహరించుకుపోయాడు. దీంతో స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం లింగాల ఆటో అడ్డా వద్ద ఎస్సై సంతోష్‌రావు, కానిస్టేబుల్ సైదులు తనిఖీ చేపట్టగా ఓ వ్యక్తి ఆటో తో అనుమానాస్పదంగా కన్పించాడు. అతన్ని ఆధీనంలోకి తీసుకుని విచారించగా ఆటో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో ఆటోను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు.

బీమాతో ధీమా

మరిపెడ రూరల్, జనవరి 25 : సమీప పోస్టు ఆఫీసుల్లో 18 ఏళ్ల నుంచి 65 ఏళ్ల లోపు ఉన్న యువతీ యువకులు యాక్సిడెంటల్ బీమా పథకంలో భాగంగా సంవత్సరానికి రూ. 525 చెల్లించిన వారు అర్హులని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్పీ ఎస్‌వీఎస్.రావు అన్నారు. తానంచర్ల జీపీ కార్యాలయంలో గురువారం శివారు మూలమర్రి తండా జీపీకి చెందిన వాంకుడోతు రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో మృతురాలి కుమారుడు వీరన్నకు రూ.10లక్షల చెక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీమాతో ధీమా ఉండవచ్చన్నారు. తానంచర్ల, మూలమర్రి తండాల సర్పంచ్లు శ్వేతముఖేష్, జగని, కాంగ్రెస్‌నాయకులు పాశం నరేష్‌రెడ్డి, నెహ్రూనాయక్, మానుకోట ఏఎస్‌పీ సైదానాయక్, మానుకోట ఐపీపీబీ మెనేజర్‌లు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ జిల్లా అడహక్ కమిటీ ఎన్నిక

నెహ్రూసెంటర్, జనవరి 25 : పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ మహబూబాబాద్ జిల్లా నూతన అడహక్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి, కార్యనిర్వహణ అధ్యక్షుడు ఎస్.శ్యాంసుందర్, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. చైర్మన్‌గా ఒబిలిశెట్టి రామకృష్ణ, వైస్ చైర్మన్‌గా ఇస్మాయిల్ బేగ్, బాబురావు, అనిల్, కన్వీనర్‌గా రాధాకుమారి, కోకన్వీనర్‌గా లోక్యనాయక్, ఫైముద్దీన్, వెంకటేశ్వర్లు, ట్రెజరరీగా కృష్ణకుమార్‌ను నియమించారు. తమ కమిటీ సభ్యులకు ఏమైనా సమస్యలు తలెత్తినప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు సహాయసహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీషలకు వినతిపత్రం అందజేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గూడూర్‌లో ఏటీఎఫ్ సమావేశం

కొత్తగూడ, జనవరి 25 : ఈనెల 27న (రేపు) ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ (ఏటీఎఫ్) జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిద్దబోయిన భిక్షం తెలిపారు. ఈసమావేశంకు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తప్పక హజరు కావాలని సూచించారు. భవిష్యత్తు కార్యచరణ, మండలాల క్యాంపేనింగ్, పలు అంశాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు.

రెండు గడ్డివాముల దగ్ధం

గార్ల, జనవరి 25 : మండలంలోని రాంపురం శివారు ప్రాంతంలో రైతులు నిల్వచేసిన రెండు గడ్డివాములను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించి, దహనం చేసినట్లు స్థానికులు తెలిపారు. ఇది గమనించిన స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. రెండు గడ్డివాముల దహనంతో సుమారు రూ.10 వేలనష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు సిరుమర్తి శ్రీను, పెద్ద అప్పయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న నూనె వెంకటయ్య

మహబూబాబాద్ రూరల్, జనవరి 25 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో గురువారం ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. బాధితుడి భార్య లక్ష్మి, కుమారుడు మహేందర్ కథనం ప్రకారం.

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్దనాగారంకు చెందిన నూనె వెంకటయ్య-లక్ష్మి దంపతులు కూలీనాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వెంకటయ్య తండ్రి నర్సయ్యకు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం విలేజ్‌లో సర్వే నెంబర్ 232/2లో 1.03 గుంటల భూమిని ఈనామ్‌గా ప్రభుత్వం ఇచ్చింది. ఆ భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు 2009లో పట్టా చేయించుకున్నారని వివరించారు. కాగా, ఈ కేసు తీర్పు వారికే అనుకూలంగానే వచ్చిందని చెప్పారు. ఇందుకు సంబంధించిన తీర్పు కాగితాలు ఇవ్వడంలో తమకు సంబంధించిన న్యాయవాది జాప్యం చేస్తోండడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటయ్య గురువారం మానుకోటలోని అంబేద్కర్ సెంటర్ సమీపంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మిర్చి కొనుగోళ్లపై చర్చలు సఫలం

- ఈనెల 30వ తేదీ నుంచి మిర్చి మార్కెట్ ప్రారంభం
- గురువారం రాత్రి వరకు కొనసాగిన చర్చలు
- పాతపద్ధతిలోనే ఖరీదులు


కేసముద్రం మార్కెట్లో వ్యాపారులు, రైతులతో చర్చలు జరుపుతున్న మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు

కేసముద్రం, జనవరి 25 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో మిర్చి కొనుగోళ్ల ప్రారంభించాలనే అంశంపై రైతు ప్రతినిధులకు, వ్యాపారులకు మధ్య గురువారం నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. మార్కెట్ కార్యాలయంలో ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రాత్రి వరకు ఈ చర్చలను జరిపారు. రైతు ప్రతినిధులు మాట్లాడుతూ మిర్చి కొనుగోళ్లలో నగదు చెల్లింపులో 2శాతం కమీషన్‌ను రద్దు చేయాలని, బస్తా ఖరీదును రైతుకు చెల్లించాలని, 100 గ్రాములతో సహా తూకంలో లెక్కించాలని కోరారు. దీనికి వ్యాపారులు మాట్లాడుతూ సరైన నాణ్యతగల మిర్చి రావడంలేదని, గతంలో మాదిరిగానే కొనసాగిస్తేనే కొనుగోళ్లు చేపడుతామని, లేదంటే తాము నష్టపోతామని స్పష్టం చేశారు. ఇరువర్గాలు ససేమిరా అనడంతో చర్చలు నిలిచిపోయాయి. అనంతరం రాత్రి మరోమారు ఇరువర్గాలు చర్చలు జరుపగా, గత ఏడాది మాదిరిగానే పాతపద్ధతిలోనే కొనసాగించాని వ్యాపారులు కోరడంతో రైతు ప్రతినిధులు అంగీకరించారు. దీంతో ఈనెల 30వ తేదీ నుంచి మార్కెట్లో మిర్చి కొనుగోళ్ల ప్రారంభించనున్నట్లు కార్యదర్శి ప్రకటించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తోకల శ్రీనివాస్‌రెడ్డి, చిదిరాల వసంతరావు, శ్రీరాం కిరణ్, బాబ్జి, సట్ల శ్రీనివాస్, సందీప్, రైతు ప్రతినిధులు బొబ్బాల యాకూబ్‌రెడ్డి, గంట దామోదర్‌రెడ్డి, మార్తినేని పాపారావు, పొలెపల్లి చెన్నారెడ్డి, చాగంటి శ్రీనివాస్, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, పొలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉద్యోగులు వీరే..

మహబూబాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లాలోని వివిధ శాఖలు, విభాగాలకు చెందిన 184 అధికారులు, ఉద్యోగులను ఉత్తమ అవార్డులకు ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ గురువారం రాత్రి వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే గణతం త్ర వేడుకల్లో కలెక్టర్ చేతులమీదుగా ఈ అవార్డులను అందుకోనున్నారు. జిల్లాలోని వివిధశాఖలకు చెందిన 28 మంది జిల్లాస్థాయి అధికారులు అవార్డులకు ఎంపిక కాగా రెవెన్యూ, పోలీస్, వైద్య, ఎస్సీ కార్పొరేషన్, అగ్నిమాపక, గిరిజన సంక్షేమ, విద్యుత్, సహకార, వాణిజ్యపన్నుల, నిఘా, బీసీ అభివృద్ధి, విద్యా, ఛీఫ్ ప్లానింగ్, పంచాయతీరాజ్, ఆయుష్, మిషన్ భగీరథ, ఆర్టీసీ, సర్వేఅండ్‌ల్యాండ్, కేవీకే మల్యాల, ఎస్సీ కార్పొరేషన్, సివిల్ సప్లయి, జిల్లా సంక్షేమ, వైద్య కళాశాల, వ్యవసాయ, జిల్లా పరిషత్, మునిసిపాలిటీ, గ్రామీణాభివృద్ధి, పశువైద్య, జైళ్ల, అటవీ, మైనార్టీ సంక్షేమ శాఖల నుంచి అధికారులను, ఉద్యోగులను ఎంపిక చేశారు.

జిల్లా ఉత్తమ అధికారులు వీరే..

జె.చెన్నయ్య(అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్), ఎల్.అలివేలు (ఆర్డీవో, మహబూబాబాద్), జి.నర్సింగరావు (ఆర్డీవో, తొర్రూరు), జి.వెంకటేశ్వర బాబు (ఎస్డీపీవో, తొర్రూరు), టి.సత్యనారాయణ (ఎస్డీపీవో, మహబూబాబాద్), లక్ష్మీనారాయణ (ఏడీ వ్యవసాయ శాఖ), సయ్యద్ ఖుర్షిద్ (జిల్లా సహకార అధికారి), కె.సూర్యనారాయణ (జిల్లా ఉద్యానవన అధికారి), ఎం.నర్సింహస్వామి(జిల్లా బీసీ అభివృద్ధి అధికారి), ఆర్.బాలరాజు(ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్), కిరణ్ (జిల్లా ఎక్సైజ్ అండ్‌ప్రొహిబీషన్ అధికారి), వి.సురేష్ (జిల్లా గ్రౌండ్‌వాటర్ అధికారి), డాక్టర్ టి.సుధాకర్ (జిల్లా పశువైద్యాధికారి), రమాదేవి (జడ్పీ సీఈవో), పి.నర్మద (జడ్పీ డిప్యూటీ సీఈవో), హరిప్రసాద్ (జిల్లా పంచాయతీ అధికారి), ఆర్.సన్యాసయ్య (డీఆర్‌డీవో), పి.సుబ్బారావు (ఛీఫ్ ప్లానింగ్ ఆఫీసర్), కె.శ్రీనివాస్ (డీపీఆర్‌వో), ఎం.వెంకన్న (జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి), జె.నరేష్‌కుమార్(ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ), కె.సురేష్ (పీఆర్ ఈఈ), ఎం.కృష్ణారెడ్డి (మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ), సురేందర్ (మిషన్ భగీరథగ్రిడ్ ఈఈ), జి.తానేశ్వర్ (ఆర్‌అండ్‌బీ ఈఈ), ఆర్.వరలక్ష్మి (జిల్లా సంక్షేమాధికారి) కె.ప్రసన్నరాణి (మునిసిపల్ కమిషనర్, మహబూబాబాద్), ఎ.రాజు (మునిసిపల్ కమిషనర్, మరిపెడ) ఉన్నారు.

రెవెన్యూ శాఖలో..

సీహెచ్.రమణి (సూపరింటెండెంట్, కలెక్టరేట్), కేవీ.పవన్‌కుమార్ (సూపరింటెండెంట్, కలెక్టరేట్), భగవాన్‌రెడ్డి (తహసీల్దార్), సైదులు (తహసీల్దార్), జి.వివేక్ (తహసీల్దార్), కె.దామోదర్ (తహసీల్దార్), ఎ.రవీంద్రనాథ్(సీనియర్ అసిస్టెంట్ సీసీ టు కలెక్టర్), సందీప్ (సీనియర్ అసిస్టెంట్), జె.తిరుపతి (సీనియర్ అసిస్టెంట్), ఎండీ నిజాముద్దీన్ (మండల గిర్దావర్), బి.శ్రావణి (సీనియర్ అసిస్టెంట్), మల్లారెడ్డి (టైపిస్ట్), టి.సురేష్), రికార్డ్ అసిస్టెంట్), రాహుల్ (ఆఫీస్ సబార్డినేట్)

పోలీస్ శాఖ.

ఆర్.నరేందర్(ఇన్‌స్పెక్టర్), పి.బాలాజి వరప్రసాద్ (ఇన్‌స్పెక్టర్), బి.రమేష్ (ఇన్‌స్పెక్టర్), వై.సత్యనారాయణ(ఇన్‌స్పెక్టర్), బి.సోములు (ఆర్ఎస్ఐ), పి.శ్యాంసుందర్ (ట్రాఫిక్ ఎస్ఐ), సీహెచ్.రమేష్‌బాబు (ఎస్ఐ), పి.సునంద (ఆర్ఎస్ఐ), ఎండీ.మౌలానా (ఎస్ఐ), హతిఖ్ హుస్సేన్ (సీనియర్ అసిస్టెంట్), బి.వీరన్న (ఏఎస్ఐ), పీసీలు బి.ప్రభాకర్, ఎం.సంతోష్, కె.దావిద్, కె.యాదగిరి, ఎం.నరేందర్, ఏ.కుమారస్వామి

వైద్య, ఆరోగ్యశాఖ..

డాక్టర్ బి.లక్ష్మణ్ (సివిల్ సర్జన్ స్పెషలిస్ట్), కె.సవిత (స్టాఫ్‌నర్స్)

దేశానికి ప్రథమ శత్రువు కాంగ్రెస్సే

- మళ్లీ మూడోసారి ప్రధానిగా నరేంద్రమోదే
- బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు


మహబూబాబాద్ బీజేపీ పార్టీ కార్యాలయంలో పార్లమెంటరీ క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

మహబూబాబాద్ రూరల్, జనవరి 25 : దేశానికి ప్రథమ శత్రువు కాంగ్రెస్ పార్టీయేనని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, మానుకోట క్లస్టర్ ఇన్‌చార్జి మార్తినేని ధర్మారావు అన్నారు. మానుకోట పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన బూత్‌స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ బీజేపీ దేశవ్యాప్తంగా మూడు జిల్లాలను కలుపుతూ ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయడం జరిగిందని, దానిని 146 క్లస్టర్లుగా విభజించారని చెప్పారు. ఒక్కో క్లస్టర్‌కు ఒకరిని ఇన్‌చార్జిగా నియమించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు వ్యతిరేకించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని, నేటి వరకు ఒక అభివృద్ధి కార్యక్రమం కూడా జరుగలేదన్నారు.

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ బలహీన పార్టీగా ఉందని ధర్మారావు చెప్పారు. దేశవ్యాప్తంగా 400 ఎంపీ స్థానాలను బీజేపీ పార్టీ గెలుచుకుని, మళ్లీ మూడోసారి ప్రధానిగా మోదీని చేయనున్నట్లు జోస్యం చెప్పారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవానికి రాకుండానే కాంగ్రెస్ పార్టీ విభజించి, పాలించాలని చూస్తోందని విర్శించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు, వెంకటరమణరెడ్డి, భైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జాటోతు హుస్సేన్‌నాయక్, ఎడ్ల అశోక్‌రెడ్డి, యాప సీతయ్య, రాచకొండ కొమురయ్య, చీకటి మహేష్‌గౌడ్, వల్లభు వెంకటేశ్వర్లు, బలరాం, భూక్య సంగీత,క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, శశివర్ధన్‌రెడ్డి, సురేందర్, పద్మ, రేష్మా, సతీష్ పాల్గొన్నారు.